ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

శుక్రవారం 22 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.33 గం.

సహర్ : శనివారం ఉ : 4.56 గం.

- ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం
- జిల్లా కేంద్రంలో తాత్కాలికంగా ఏర్పాటైన ట్రాఫిక్ ఠాణా
- ఎస్పీ చొరవతో ప్రత్యేకంగా 18 మంది సిబ్బంది నియామకం
- నిరంతరం సాగుతున్న తనిఖీలు.. జరిమానాల విధింపు
- నెలన్నర రోజుల్లో 1,589 కేసులు.. రూ.2,49,200 ఫైన్
- ఇప్పుడిప్పుడే వాహనదారుల్లో వస్తున్న మార్పు

పట్టుబడితే ఫైనే





ట్రాఫిక్ ఠాణాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ (ఫైల్)

కృష్ణకాలనీ(భూపాలపల్లి), మార్చి 21 : ఇష్టానుసారంగా వాహనాలు నడిపే వారి ఆటలు ఇక చెల్లవు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ మూల్యం చెల్లించాల్సిందే. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం అయ్యాయి. హద్దు మీరితే జరిమానాలు విధించడంతో పాటు జైలు శిక్ష వేసే అవకాశాలు సైతం ఉండనున్నాయి. జిల్లా పోలీసు బాస్ ప్రత్యేక చొరవతో తాత్కాలిక ట్రాఫిక్ ఠాణా ప్రారంభమైంది. 18 మంది ప్రత్యేక సిబ్బంది నియామకం కాగా.. ట్రాఫిక్ సేవలు రోజు రోజుకు విస్తృతం అవుతున్నాయి. నిబంధనలు అతిక్రమించే వారి పట్ల ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తూ వాహనదారులను కట్టడి చేస్తున్నారు.

పెండింగ్‌లో ప్రతిపాదనలు

ట్రాఫిక్ నియంత్రణకు ప్రతీ జిల్లా కేంద్రంలో తప్పనిసరిగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఉండాలి. కానీ, భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మాత్రం ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కాలేదు. జిల్లా పోలీసు శాఖ ఐదేళ్ల కిందటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా.. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి పురోగతి మాత్రం ఏమీ రాలేదు. మరోవైపు ట్రాఫిక్ నియంత్రణకు ఇన్నాళ్లు స్థానికంగా ఉన్న పోలీస్‌స్టేషన్ సిబ్బందే ఇబ్బందులు పడుతూ నామమాత్రంగా ట్రాఫిక్ విధులు చేపట్టారు. ట్రాఫిక్‌ను అరికట్టేందుకు ప్రధాన కూడళ్లలో ఇద్దరేసి హోంగార్డులను నియమించినా ఫలితం అంతగా కనబడలేదు.

పోలీసు బాస్.. ప్రత్యేక చొరవ

భూపాలపల్లి జిల్లా కేంద్రంగా మారాక ఇక్కడికి రాకపోకలు అధికమయ్యాయి. ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు జఠిలంగా మారుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి అందిన మౌలిక ఆదేశాలతో ట్రాఫిక్ ఠాణా ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ప్రత్యేకంగా గదులను కేటాయించి ట్రాఫిక్ ఠాణా కళ తీసుకొచ్చారు. ఫిబ్రవరి 7న ఈ ఠాణాను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎస్పీ కిరణ్‌ఖరేలు హాజరై ప్రారంభించి ట్రాఫిక్ సేవలను అందుబాటు లోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి నిరంతరాయంగా ట్రాఫిక్ సేవలు అమలవుతున్నాయి.

ప్రత్యేకంగా 18 మంది సిబ్బంది..

ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా 18 మంది సిబ్బందిని నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 మండలాల్లో వివిధ ఠాణాల్లో పని చేస్తున్న సిబ్బందికి ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. చిట్యాల, టేకుమట్ల, కాటారం, మల్హర్‌కు చెందిన సిబ్బంది ఉండగా.. భూపాలపల్లి పోలీసు ఠాణాలో 2వ ఎస్సైగా ఉన్న చంద్రగిరి శ్రీనివాస్‌కు ట్రాఫిక్ బాధ్యతలు అప్పగించారు. ఒక ఎస్సై, ఒక ఏఎస్సై, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, 13 మంది కానిస్టేబుళ్లను నియమించారు. దీంతో ఉదయం ట్రాఫిక్ రూల్స్ మొదలు రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల వరకు వీరి సేవలు కొనసాగుతున్నాయి.

విస్తృతంగా తనిఖీలు..

ఇన్నాళ్లు ట్రాఫిక్ ఠాణా లేకపోవడంతో కొంత మంది వాహనదారులు నిబంధనలు బేఖాతరు చేస్తూ వచ్చారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం.. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అతిక్రమించడం, ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణించడం వంటివి జిల్లా కేంద్రంలో చోటు చేసుకునేవి. ఇటీవల డ్రంకెన్ డ్రైవ్, వాహనాల తనిఖీలు పెరగడంతో వాహనదారులు ఆచితూచి అడుగేస్తున్నారు. ఇక జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలితో పాటు బాంబులగడ్డ, గణేష్‌చౌక్, మంజూర్‌నగర్ వరకు ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ నేతృత్వంలో ప్రత్యేకంగా తనిఖీలు చేపడుతున్నాడు. భారీ జరిమానాలతో పాటు వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపిస్తున్నారు.

ప్రమాదాల కట్టడికి ఆస్కారం

నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం అతివేగం, మద్యం మత్తులో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం వల్ల జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు వచ్చిన నాటి నుంచి ఈ మూడింటికి భారీ జరిమానాలు విధించే అవకాశం ఉండటంతో ఈ రకమైన ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక మైనర్లకు వాహనం ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తపడే విధంగా చట్టంలో సైతం శిక్షలు కఠినంగా ఉన్నాయి.

1,589 కేసులు.. రూ.2,49,200 ఫైన్‌లు..

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఠాణా అందుబాటులోకి వచ్చిన నెలన్నర రోజుల్లోనే కేసుల నమోదుతో పాటు జరిమానాలు భారీగానే విధించబడ్డాయి. మొత్తంగా 1,589 కేసులు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు.. రూ.2,49,200 ఫైన్‌లు విధించారు. ఇందులో ప్రధానంగా ట్రాఫిక్ సిగ్నల్స్ అతిక్రమించడంపై 31 కేసులు నమోదుచేసి రూ.35వేల జరిమానాలు విధించారు. అలాగే ట్రిపుల్‌రైడ్‌లో 31 కేసులకు

మిగతా 8వ పేజీలో...

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఎస్పీ



రాచపల్లిలో పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ శబరీశ్

వెంకటాపురం(నూగూరు), మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రాచపల్లి, మహితాపురం, కమ్మరిగూడెం, వాడగూడెం, వెంకటాపురం పోలింగ్ స్టేషన్లను గురువారం జిల్లా ఎస్పీ శబరీశ్ సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ స్టేషన్ల వద్ద తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ములుగు డీఎస్పీ రవీందర్, స్థానిక సీఐ బండారి కుమార్, ఎస్సై అశోక్, సిబ్బంది ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

వాజేడు : మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ శబరీశ్ గురువారం సాయంత్రం పరిశీలించారు. మండలంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న మురుమూరు, కొంగాల, అరుణాచలపురంలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనంతరం వాజేడు స్టేషన్ సందర్శించి రాబోయే పార్లమెంటు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. ఆయన వెంట డీఎస్పీ రవీందర్, సీఐ బండారి కుమార్, ఎస్సై వెంకటేశ్వరరావు ఉన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తించాలి

- డీఎంహెచ్‌వో అప్పయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు కలెక్టరేట్, మార్చి 21 : జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్థులను పూర్తి స్థాయిలో గుర్తించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య సిబ్బందికి సూచించారు. ములుగులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పోరిక రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపు ఉద్యమం) 14 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 11 రోజుల పాటు జిల్లాలోని గ్రామాల్లో కొనసాగిందని తెలిపారు. 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 483 బృందాలు ఇంటింటి సందర్శన చేస్తూ 2,67,728 మందిని పరీక్షించారని చెప్పారు. అందులో 715 మంది అనుమానితులను గుర్తించినట్లు తెలిపారు.

మరో మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో కుష్టుతో బాధపడుతున్న వారిని గుర్తించాలని డీఎంహెచ్‌వో సిబ్బందికి సూచించారు. సమావేశంలో లెప్రసీ నోడల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరు అందించాలి

◆ కలెక్టర్ ఇలా త్రిపాఠి ◆ తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష

వాజేడు, మార్చి 21 : ప్రతీ ఇంటికి తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. వేసవి కాలం వచ్చిన దృష్ట్యా ప్రజలెవరూ తాగునీటి కోసం ఇబ్బందులు పడొద్దన్నారు. వాజేడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆమె తాగునీటి సరఫరాపై అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) పి.శ్రీజతో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, జీపీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ధర్మవరం, పేరూరు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో అక్కడ సంపు నిర్మాణంపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను ముందే గుర్తించి ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీరు సరఫరా కాని గ్రామాలు ఏమైనా ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకోవాలని, వేసవి మూడు నెలల పాటు తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో ఉన్న బోర్‌వెల్స్, చేతి పంపులను పరిశీలించి పనిచేయని వాటికి తక్షణమే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ధర్మవరం గ్రామంలో వాటర్ ట్యాంకు సంపు నిర్మాణాన్ని పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యాతా ప్రమాణాలు పాటించి ఏప్రిల్ 25 లోపు పూర్తిచేసి వాటర్ ట్యాంకు నుంచి నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట ఎస్‌పీడీసీఎస్ డీఈ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, డీసీవో సర్దార్‌సింగ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ, వైద్యాధికారులు మధుకర్, యోషిత, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, జీపీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.



ధర్మవరంలో సంపు నిర్మాణం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

మల్లూరు గుట్టపై తవ్వకాల కలకలం

పోలీసుల అదుపులో గుప్త నిధుల ముఠా?

మంగపేట, మార్చి 21: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవాలయానికి కిలోమీటరు దూరంలో గత కొన్ని రోజులుగా ఓ ముఠా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో గురువారం 10 మంది ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల వివరాల ప్రకారం... గుట్ట కింది భాగంలో కొంత కాలంగా అటవీ అభివృద్ధి పనులను అటవీశాఖ అధికారులు, సహాయకులు చేపడుతున్నారు. ఇదే క్రమంలో మల్లూరుకు చెందిన ఓ వ్యక్తి, తాడ్వాయి మండలం కాటాపురంకు చెందిన మరో వ్యక్తితో పాటు పలు ప్రాంతాలకు చెందిన 10 మంది ముఠాగా ఏర్పడి గుట్టపై కొంత కాలంగా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని స్థానిక పోలీసులు తెలుసుకొని తవ్వకాలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే గురువారం మధ్యాహ్నం పక్కా సమాచారంతో దాడులు చేసినట్లు సమాచారం. అటవీశాఖ అధికారితో పాటు కాటాపురంకు చెందిన వ్యక్తిని, మరో ఆరుగురిని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. అలాగే ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై స్థానిక ఎస్సై రవికుమార్‌కు ఫోన్ చేయగా, స్పందించలేదు. సాయంత్రం మరోసారి ప్రయత్నించగా, ఫోన్ ఎత్తి ఏదైనా సమాచారం ఉంటే తెలియజేస్తామనడం గమనార్హం.



మల్లూరు గుట్ట కింది భాగంలో గుప్తనిధుల కోసం తవ్విన లోతైన గుంత

తెరపైకి రోజుకో పేరు...

- కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై ఆశావాహుల్లో ఉత్కంఠ
- వరంగల్ టికెట్‌పై కుదరని ఏకాభిప్రాయం
- తలో పేరుతో అధిష్ఠానంపై మంత్రుల ఒత్తిడి
- ఏఐసీసీ సీఈసీలో వరంగల్ సీటుపైనే ప్రధాన చర్చ
- ఎంపీ దయాకర్‌తో పాటు ఇందిర, సాంబయ్య, పరంజ్యోతిల్లో అవకాశమెవరికో?
- తాజా జాబితాలోనూ రాని స్పష్టత



వరంగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ వరంగల్ అభ్యర్థిత్వంపై రోజుకోపేరు తెరపైకి వస్తోంది. దీంతో అటు ఆశావహులతో పాటు.. ఇటు కేడర్‌లోనూ గందరగోళం ఏర్పడుతోంది. అయితే మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం లేకపోవటంతోనే ఇదంతా జరుగుతోందని, ఏఐసీసీ కూడా ఆచితూచి అడుగులు వేస్తోందన్న చర్చ జరుగుతోంది. నిన్నటి వరకు దొమ్మాటి సాంబయ్యకే టికెట్ ఖరారైందన్న ప్రచారం జరగ్గా.. అనూహ్యంగా సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ పేరు తెరపైకి రావటం చర్చనీయాంశంగా మారింది. వరంగల్ టికెట్ కోసం ఈ నియోజకవర్గం నుంచి 50మందికి పైగా క్యూ కట్టినప్పటికి అన్ని వడపోతల తరువాత నలుగురు పేర్లపైనే ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. గురువారం సాయంత్రం కాంగ్రెస్ జాబితా విడుదలగా.. రాష్ట్రంలో గతంలో నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన అధిష్ఠానం.. తాజాగా మరో ఐదుగురికి అవకాశం ఇచ్చింది. కానీ అందులో వరంగల్ అభ్యర్థి ఎవరనేది స్పష్టత రాలేదు. ఇక హోలీపండుగ తర్వాతే వరంగల్ అభ్యర్థిత్వం ఎవరనేది తేలుతుందని భావిస్తున్నారు.

కాంగ్రెస్‌కు సవాల్‌గా వరంగల్ అభ్యర్థి ఎంపిక..

ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన వరంగల్ స్థానంపై కాంగ్రెస్‌లోని ఆశావాహులు భారీ ఆశలు పెట్టుకున్నారు. టికెట్ కోసం గత నెల దరఖాస్తులు స్వీకరించగా, అత్యధికంగా 42మందికిపైగా టికెట్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించిన ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ మూడు పేర్లతో జాబితా తయారు చేసి ఏఐసీసీకి నివేదిక పంపించింది. ఈ జాబితాలో గత ఎన్నికల్లో ఎంపీగా పోటీచేసి ఓటమిపాలైన దొమ్మాటి సాంబయ్యతో పాటు స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన శనిగపురం ఇందిరా, నమిండ్ల శ్రీనివాస్ పేర్లు ఉన్నట్టు ప్రచారం జరిగింది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ టికెట్‌ను

మిగతా 8వ పేజీలో...

ఓటు వేసే విధంగా ఓటర్లను చైతన్యపరచాలి

హనుమకొండ కలెక్టరేట్, మార్చి21: ఓటు హక్కు కలిగిన ప్రతీ ఓటరును ఎన్నికల్లో ఓటు వేసే విధంగా చైతన్యపరచాలని ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్వీప్ ఆధ్వర్యంలో గురువారం వివిధ శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, అపార్ట్‌మెంట్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ.. స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీ రమాకాంత్, డీఆర్‌వో వైవీ గణేష్, జీడబ్ల్యూఎంసీ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 21: వరంగల్ రీజియన్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ సీట్ల కోసం ఈనెల 23 వరకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.విద్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికిగాను కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 8, 9 తరగతుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 23లోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని ఆమె తెలిపారు. www.tswreis.ac.in వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.



ఉప రాష్ట్రపతిని కలిసిన వద్దిరాజు రవిచంద్ర

ఉపరాష్ట్రపతిని కలిసిన ఎంపీ రవిచంద్ర

వరంగల్ సిటీ, మార్చి 21: బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర గురువారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధనకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తెలంగాణ శాసన సభ్యులు మీసేవలను గుర్తించి, మీ పట్ల విశ్వాసం ఉంచి తిరిగి రాజ్యసభకు పంపించారని ఈ సందర్భంగా జగదీప్ ధన్‌కర్ రవిచంద్రను అభినందించారు. అదేవిధంగా ఈ ప్రజాస్వామ్య(పార్లమెంట్) దేవాలయంలో అర్థవంతమైన, ఆరోగ్యకరమైన చర్చలు జరిపేందుకు మీ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని రవిచంద్రతో అన్నారు. స్పందించిన రవిచంద్ర ధనకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్య



ప్రశాంత్(ఫైల్)

ఐనవోలు, మార్చి 21: ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఐనవోలులో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బరిగెల ప్రశాంత్(24) మూడేళ్ల నుంచి కొంత మంది రైతుల వద్ద నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగుచేయగా దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయాడు. పెట్టుబడులకు చేసిన రూ.4లక్షల అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గుర్తించి వేలాడుతున్న ఉరి నుంచి అతడిని తప్పించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. కౌలు రైతుగా చేసిన అప్పులు తీర్చే దారి కనిపించక భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య అనుషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు.

మందులోళ్లు.. మాయలోళ్లు..

● అక్రమంగా ప్రభుత్వ మందుల విక్రయాలు ● కంటి ఆస్పత్రిలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న దందా



వరంగల్ మెడికల్, మార్చి 21: ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో మాయలోళ్లు తయారయ్యారు. మందులు పంపిణీ చేసే ఉద్యోగులు అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఔషధాలను పేద రోగులకు ఇవ్వకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇదంతా ఏళ్ల తరబడి జరుగుతున్నప్పటికీ పర్యవేక్షించాల్సిన ఆస్పత్రి సూపరింటెండెంట్ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఏకంగా అక్రమ మందుల విక్రయాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకునేంతవరకు కూడా ఆస్పత్రి అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఆరోపణలు వచ్చినా అంతే..

ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఫార్మసిస్టు నాగేందర్‌పై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయనపై చర్యలు తీసుకోవడం లేదు. గతంలో స్టోర్స్‌లో పనిచేసిన ఈయన.. మళ్లీ అదే ఆస్పత్రిలో ఓపీ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. కొన్నేళ్లుగా ఇదే ఆస్పత్రిలో తిష్ట వేయడంతోపాటు అన్ని విషయాలు అవపోసనపట్టి అక్రమంగా మందులను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎంజీఎంతోపాటు బోధనాస్పత్రుల్లో కూడా ఈ దందా కొనసాగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మురికివాడల్లోని అర్బన్ సెంటర్లలో కూడా మందులు పక్కదారి పడుతున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.

మార్కెట్‌లో శాంపిల్స్

వివిధ కంపెనీలు డాక్టర్లకు ఇచ్చే శాంపిల్ ఔషధాలు కూడా మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. ఇవి డాక్టర్ ద్వారా రోగులకు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని మెడికల్ షాపులు విక్రయాలకు తెగబడుతున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా కొందరు లేబుళ్లను మార్చి నకిలీ మందులను కూడా తయారు చేస్తున్నట్లు కొంతకాలంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నార్కోటిక్ డ్రగ్స్ డాక్టర్ చిట్టీ లేకుండానే అమ్ముతున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ తనిఖీల్లో అనేక పర్యాయాలు బయటపడింది. కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కాజీపేట సమీపంలోని నిట్‌క్యాంపస్ ఏరియాలో నార్కోటిక్ డ్రగ్స్ విక్రయాలు కొనసాగుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

అన్నీ ప్రైవేట్ అద్దాల షాపులే..

ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల గల్లీలో నిబంధనలకు విరుద్ధంగా అన్నీ ప్రైవేట్ అద్దాల షాపులే వెలిశాయి. మెడికల్ షాపుల్లో సైతం అద్దాలు విక్రయించడం కనిపిస్తుంటుంది. కంటి ఆస్పత్రి నాలుగో తరగతి ఉద్యోగులు ప్రయివేట్ అద్దాల షాపులతో కుమ్మక్కై రోగులను బయటకు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా కంటి అద్దాలను విక్రయాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగా ఈ దందా జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు చూడకపోవడం గమనార్హం.

‘బార్’ బరిలో వీరే..

హనుమకొండ బార్ ఎన్నికల్లో పోటాపోటీ

వరంగల్ లీగల్, మార్చి 21: హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్‌కు ఈనెల 28న జరుగనున్న ఎన్నికల బరిలో 32 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అధ్యక్షస్థానానికి ఎం.రమేష్‌బాబు, పి.సత్యనారాయణ పోటీ పడుతుండగా ఉపాధ్యక్ష పదవికి పి.రఘుపతి, ఎస్.రాజన్‌బాబు, పి.రవీందర్, ఎస్.యుగంధర్ బరిలో ఉన్నారు. అలాగే ప్రధానకార్యదర్శి పదవికి వి.నరేందర్, పి.నవీన్‌కుమార్, ఎల్.రమేష్, బి.శంకర్, ఆర్.వేణుగోపాల్ పోటీ పడుతున్నారు. మహిళా జాయింట్ సెక్రటరీ పదవికి వి.పద్మ, జె.స్వప్న, స్పోర్ట్స్ కల్చరల్ జాయింట్ సెక్రటరీ పదవికి పి.చిరంజీవి, ఎం.మహేష్ పటేల్, సి.మల్లేష్, కోశాధికారి పదవికి జి.సదానందం, పి.సమ్మిరెడ్డి, ఎ.శివశంకర్‌లు పోటీ పడుతున్నారు. కార్యవర్గ సభ్యులుగా డి.అచ్యుత్‌కుమార్, జి.అనిల్ లాలానాయక్, ఇ.చంద్రశేఖర్, సీహెచ్.నిఖిల్‌కుమార్, వి.రమేష్, కె.రుత్విక్, ఎ.సందీప్‌కుమార్, ఎన్.సుహాస్, డి.సునిల్‌కుమార్, మహిళా కార్యవర్గ సభ్యుల పదవికి జి.రమాదేవి, కె.ఉష పోటీ పడుతున్నారు. జాయింట్ సెక్రటరీ పదవికి ఎన్.విజేందర్, లైబ్రరీ జాయింట్ సెక్రటరీ పదవికి బి.సంపత్, 30 ఏళ్ల న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గ సభ్యుడిగా జి.సురేందర్‌రెడ్డి, 20 ఏళ్ల న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గ సభ్యుడిగా టి.శ్రీనివాస్, 10 ఏళ్ల మహిళా న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గసభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు.

చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్టు

కాజీపేట, మ్యా 21 : చిరువ్యాపారుల గల్లా పెట్టెల్లోంచి నగదు చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మూడు రోజుల క్రితం కాజీపేటలో నాగరాజు ఫ్రూట్ షాపులో ఓ వ్యక్తి ఫ్రూట్స్ కొనుగోలు చేసి అతడి దృష్టి మరల్చి గల్లా పెట్టెల్లోంచి రూ.1250 చోరీ చేశాడు, నాగరాజు ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో గురువారం కడిపికొండ బ్రిడ్జి వద్ద పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోతుండగా అతడిని పట్టుకుని ఆరా తీయగా అతడి పేరు యాకుబ్ పాష అని వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన ఇతను కాజీపేట ఫ్రూట్ షాపులో నగదును, పలు షాపులలో చోరీలకు పాల్పడుతున్నానని ఒప్పుకున్నాడు. నేరం ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపారు. కేసును చేధించిన ఎస్సై శివకృష్ణ, కానిస్టేబుల్స్ భాస్కర్, విష్ణులను ఏసీపీ తిరుమల్ రావు అభినందించారు.

సమర్థవంతంగా పనిచేస్తున్న సంఘాలు

నాబార్డు డీజీఎం తప్పని కుమార్ సాహూ



మాట్లాడుతున్న కుమార్ సాహూ

కాళోజీ జంక్షన్, మార్చి 21: ఉమ్మడి వరంగల్ జిల్లాలో 64 రైతు ఉత్పత్తి దారుల సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, సంఘాలు ఏర్పడిన మొదట్లో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం చాలా సంఘాలు విజయవంతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని నాబార్డు డీజీఎం తప్పని కుమార్ సాహూ అన్నారు. నాబార్డు వరంగల్ క్లస్టర్ ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో గురువారం నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘాల అభివృద్ధికి అవసరమైన శిక్షణ, కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. కందులను డైరెక్టుగా కాకుండా పప్పుగా మార్చడం ద్వారా రైతుకు రెట్టింపు ఆదాయం సమకూరుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో వరంగల్ డీడీఎం చంద్రశేఖర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ సంతోష్, కార్తీక్, హర్షవర్ధన్, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు రెడ్‌క్రాస్ చైర్మన్ శుభాకాంక్షలు



గవర్నర్‌కు బోకే అందజేస్తున్న హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, సభ్యులు

కాళోజీ జంక్షన్, మార్చి 21: రాష్ట్ర నూతన గవర్నర్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ రాధాకృష్ణన్‌ను హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రెడ్ క్రాస్ కార్యక్రమాలపై జిల్లా చైర్మన్లు రాష్ట్ర పాలక వర్గ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గవర్నర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రెడ్ క్రాస్ సంస్థలు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాయని ఇక ముందు కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. వేసవి కాలం దృష్ట్యా బ్లడ్ సెంటర్లలో రక్తం కొరత లేకుండా చూడాలని ఆయన సూచించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే శిక్ష తప్పదు

రౌడీషీటర్లకు హనుమకొండ సీఐ సతీష్ హెచ్చరిక



రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సతీష్

హనుమకొండ టౌన్, మార్చి21 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినట్లయితే కఠినమైన శిక్షలు తప్పవని హనుమకొండ సీఐ వై.సతీష్ రౌడీషీటర్లను హెచ్చరించారు. గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడుంటున్నారు..? ఎవరెవరు ఏమి చేస్తున్నారు? అనే దానిపై అడిగి తెలుసుకున్నారు. ఆరు నెలల వ్యవధిలో బైండోవర్ కాని వారిని తప్పనిసరిగా ఈసారి బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎవరెవరిపై కేసులు నమోదయ్యాయని ఆరా తీశారు. అసాంఘిక చర్యలకు పాల్పడ్డట్లు ఫిర్యాదు అందితే ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టేదిలేదని హెచ్చరించారు. కౌన్సెలింగ్ హాజరుకాని వారికి త్వరలోనే నిర్వహిస్తామన్నారు. కౌన్సెలింగ్‌లో సీఐతోపాటు ఎస్సైలు శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

పోలీసు అధికారిపై పోక్సో కేసు?

రహస్యంగా పోలీసుల విచారణ

వరంగల్ క్రైం, మార్చి21: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం సీఐగా పొరుగు జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైనట్లు అధికారిక సమాచారం. 2022 సంవత్సరంలో కేయూలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో సదరు అధికారికి స్టేషన్ పరిధిలో ఒక మహిళతో సన్నిహిత సంబంధాలున్నట్లు సమాచారం. ఈ విషయంలో మహిళ భర్త పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఏఆర్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. అనంతరం సీఐగా పదోన్నతి పొంది ఖమ్మం జిల్లాకు, అటునుంచి భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లిన సదరు అధికారి.. ఇంకా మహిళతోనే సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు మహిళ కూతురిపై కన్నేసిన పోలీసు అధికారి.. అత్యాచార యత్నం చేసినట్లు తెలిసింది. మైనరైన తన కూతురుపై పోలీసు అధికారి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఇటీవల కేయూలో మహిళ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విచారణ చేసిన కేయూ పోలీసులు.. గురువారం సదరు అధికారిపై అత్యాచార యత్నం, పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై కేయూ పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా చెప్పేందుకు నిరాకరించారు. పోలీస్ అధికారి కావడంతో వివరాలు వెల్లడించలేదు. రహస్యంగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

లారీ డ్రైవర్‌పై కానిస్టేబుళ్ల దౌర్జన్యం

● కేసముద్రంలో వారం కిందట ఘటన
● ఎస్పీ ఆధ్వర్యంలో విచారణ

కేసముద్రం, మార్చి 21 : కేసముద్రం స్టేషన్‌లో ఓ లారీ డ్రైవర్‌పై ఇద్దరు కానిస్టేబుళ్లు దౌర్జన్యంగా వ్యవహరిస్తూ బట్టలు విప్పి డ్రాయర్‌పై లాగుతున్న ఫొటో గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇసుకను రవాణా చేసిన ఒక లారీ డ్రైవర్‌పై కేసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు అసభ్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ వంశీధర్‌ను వివరణ కోరగా, ఈ ఘటనపై జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చామని, దీనిపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఇదిలా ఉండగా విచారణ అనంతరం సదరు కానిస్టేబుళ్లను నేడోరేపో సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు ఎస్పీ కార్యాలయం నుంచి సమాచారం అందింది.

మానుకోటలో ‘రజాకార్’ సందడి

లక్ష్మీ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించిన చిత్ర యూనిట్



మహబూబాబాద్ లక్ష్మీ థియేటర్‌లో మాట్లాడుతున్న సినీ నటి అనసూయ

మహబూబాబాద్ టౌన్, మార్చి 21 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ‘రజాకార్’ చిత్రం యూనిట్ సభ్యులు గురువారం సందడి చేశారు. సినిమా విజయవంతంగా ప్రదర్శిస్తున్న నేపథ్యం లో అందులోని నటీనటులు అనసూయ, రాజ్‌అర్జున్, గిరి, శివం, సత్యనారాయణ, రమణ, అంజిరెడ్డి, పూజ, సినీ దర్శకుడు యాట సత్యనారాయణ, సంగీత దర్శకుడు, మానుకోట ప్రాంతవాసి బీమ్స్ సిసిరోలియో మానుకోటలో పర్యటించారు. రజాకార్ చిత్రం ప్రదర్శింపబడుతున్న లక్ష్మీ థియేటర్‌కు యూనిట్ సభ్యులు చేరుకోవడంతో ప్రేక్షకులు పెద్దఎత్తున తరలివచ్చి, ఘనస్వాగతం పలికారు. బాణ సంచాలు కాల్చుతూ, పూలుచల్లుకుంటూ ఆహ్వానించారు. యూనిట్ సభ్యులు కొద్దిసేపు ప్రేక్షకులతో కలసి సినిమాను వీక్షించారు. అక్కడకు వచ్చిన ప్రేక్షకులు, అభిమానులు నటీనటులు, సంగీత దర్శకుడితో ఫొటోలు దిగడానికి ఉత్సాహం చూపారు.

మన చరిత్రను భావితరాలకు తెలియజేయాలి

మన చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సినీనటి అనసూయ అన్నారు. నాడు రజాకార్లు హైదరాబాద్ సంస్థానంలో ప్రజలను ఎంత ఇబ్బంది పెట్టారో రజాకార్ చిత్రంలో చూపించడం జరిగిందని, తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతీఒక్కరు ఈ సినిమాను చూడాలని కోరారు. నాడు రజాకార్ల ఆగడాలను ఎదిరించిన యోధుల చరిత్రను మరువవద్దన్నారు. ఈ సినిమాతో తనకు మరింత గుర్తింపు వచ్చిందని, ఇందులో తనకు నటించే అవకాశం కల్పించిన దర్శకుడు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. మానుకోట ప్రాంతవాసి సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు మంచి సంగీతాన్ని అందించారని చెప్పారు.

స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటం

నిజాం నిరంకుశ పాలనలో రజాకార్ల ఆగడాలను ఎదురించి పోరాడిన యోధుల చరిత్రను భావితరాలకు అందించేందుకు తీసిన చిత్రం రజాకార్ అని సినీ దర్శకుడు యాట సత్యనారాయణ పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై ఉన్న అందరికీ ఈ చరిత్ర తెలువాలన్నారు. నాడు పర్కాలలో తొలి జాతీయజెండా ఎగురవేత, వరంగల్ జిల్లాలోని ఖిలాలో బత్తిని మొగిలయ్య జెండాను ఎగురవేసిన చరిత్ర రజాకార్ సినిమాలో కళ్లకు కట్టినట్లుగా చూపించామన్నారు. సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ గత చరిత్ర భావితరాలకు తెలియకుంటే మన చరిత్రను తెలియ జేయడానికి ఎవరూ ఉండరని చెప్పారు. రజాకార్ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిత్ర యూనిట్ సభ్యులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో లక్ష్మీ థియేటర్ యాజమాని చాపల రంజిత్‌రెడ్డి, డాక్టర్ బానోత్ వీరన్న, డాక్టర్ పరికిపండ్ల అశోక్, స్థానిక సినీ నటులు రాజు, శ్రీను పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం మండలకేంద్రంలోని గాంధీ సెంటర్‌లో ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద రజాకార్ చిత్ర యూనిట్ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం పాలనలో పేదల పక్షాన పోరాడి అమరులైన వీరులు చిరస్థాయిలో చరిత్రలో నిలిచి పోతారని చెప్పారు. అనంతరం రజాకార్ చిత్ర విశిష్టతను ప్రజలకు తెలియపర్చిన యూనిట్ సభ్యులు ప్రతీ ఒక్కరు ఈ సినిమాను చూడాలని విజ్ఞప్తి చేశారు. చిత్ర యూనిట్ సభ్యులకు కళాకారులు ఘన స్వాగతం పలికారు, ఈ కార్యక్రమంలో సినీనటీ అనసూయ, దర్శకులు యాట సత్యనారాయణ, సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో, బయ్యారం వీరన్న పాల్గొన్నారు.

గందరగోళంలో ‘గృహజ్యోతి’



జీరో బిల్లు రాకపోవడంతో వినియోగదారుల్లో అయోమయం

తిరస్కరణకు గురైన దరఖాస్తులకు ఎన్నికల కోడ్ అడ్డంకి

తర్వాత జీరో బిల్లు ఇస్తామంటున్న విద్యుత్ అధికారులు

హనుమకొండ టౌన్, మార్చి 21: 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్నప్పటికీ జీరో బిల్లు రాకపోవడంతో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీరో బిల్లు రాని వాళ్లు మరోసారి మండల పరిషత్, మునిసిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆయా కౌంటర్లలో ఎన్నికల్లో కోడ్ పేరిట దరఖాస్తులను స్వీకరించడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో హైరానా మొదలైంది. తెల్లరేషన్ కార్డు ఉండి 200 యూనిట్లలోపు విద్యుత్ వాడకునే కుటుంబాలు జీరోబిల్లు రాకున్నా విద్యుత్ బిల్లు కట్టాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి చెప్పినప్పటికీ అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఇదిలా ఉంటే.. విద్యుత్‌శాఖ అధికారులు సైతం ఎన్నికల తర్వాత మార్చి, ఏప్రిల్, మే నెలలకు కలిపి జీరో బిల్లు ఇస్తామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని చెబుతున్నప్పటికీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో టెన్షన్ మొదలైంది.

అవగాహన లోపం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన పేరిట ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తు సమయంలో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి.. ఏ పథకానికి ఏ వివరాలు నింపాలి.. అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం చెందారు. ఫలితంగా కొంతమంది లబ్ధిదారులు ఒకదాని బదులు ఇంకొకటి రాశారు. గృహజ్యోతికి దరఖాస్తు చేసుకునే సమయంలో యుఎస్సీ నెంబర్‌కు బదులు ఎస్సీ నెంబర్ రాశారు. ఇంకొందరు సరిగ్గా రాసినప్పటికీ డాటా ఎంట్రీ చేసే సమయంలో అయిన తప్పిదాల కారణంగా జీరో బిల్లు రాలేదని తెలుస్తోంది. అయితే మరోసారైనా సరిగా దరఖాస్తు చేసుకుందామని మునిసిపల్, మండల పరిషత్ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నప్పటికీ దరఖాస్తులు స్వీకరించపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

హనుమకొండ జిల్లాలో 1,02,56 మంది దరఖాస్తు చేసుకోగా, 98,864 మందికి మాత్రమే జీరోబిల్లు వచ్చింది. జనగామ జిల్లా నుంచి 78,655 మంది దరఖాస్తు చేసుకుంటే 77,822 మంది మాత్రమే జీరో బిల్లు పొందారు. మహబూబాబాద్ జిల్లా నుంచి 90,026 మందికి 88,658 మంది మాత్రమే జీరోబిల్లు పొందారు. అదే విధంగా ములుగు, భూపాలపల్లి నుంచి 77,250 మంది దరఖాస్తు చేసుకుంటే 72,638 మంది జీరోబిల్లు పొందారు. వరంగల్ జిల్లా నుంచి 1,02,836 మంది దరఖాస్తు చేసుకుంటే 99,426 మంది మాత్రమే జీరో బిల్లు పొందారు.

రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం

ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



కాజీపేటలోని మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

కాజీపేట, మార్చి 21: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పంటనష్టంపై అంచనావేయాలని అధికారులను ఆదేశించారని స్టేట్ కో- ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. గురువారం కాజీపేట మీడియా పాయింట్‌లో జంగా రాఘవరెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వాలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. తెలంగాణ కోసం 12 వందల మంది ఉద్యమకారులు ప్రాణాల త్యాగాలు చేస్తే బోగాలు అనుభవించి, విపరీతమైన ఆస్తులు సంపాదించింది మాత్రం కల్వకుంట్ల కుటుంబమేనన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ నాయకులు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఎద్దేవ చేశారు. రైతుల కోసం ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడటం విడ్డూరంగా వుందన్నారు.

రైతు అభివృద్ధిపై ఎర్రబెల్లి దయాకర్ రావు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. దయాకర్‌రావు ఓ పెద్ద దొంగ అని, ఫోన్ ట్యాపింగ్ కేసులో జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. బీజేపీ సైతం రైతుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల కోసం బీజేపీ డ్రామాలు తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం అన్నారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుంచు చంద్రయ్య, తొట్ల రాజు యాదవ్, బోయిని కుమార్, గర్రం కోటేశ్వర్, గంగుల శ్రీనివాస్ రెడ్డి, కట్కూరి రమేశ్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

కన్నాయిగూడెం, మార్చి 21 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ ఎండీ.సలీం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలు పక్క మండలాలకు వెళ్లకుండా ఇక్కడే ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సెంటర్‌లో ఆధార్ అప్‌డేట్, న్యూ ఎన్‌రోల్‌మెంట్, బయోమెట్రిక్ అప్‌డేట్, ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు తదితర సేవలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌రోల్‌మెంట్ అధికారి తూరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జ్‌గా సురేందర్

ములుగు కలెక్టరేట్, మార్చి 21 : బీజేపీ ఎస్టీ మోర్చా వరంగల్ పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జిగా ములుగు జిల్లా కేంద్రానికి చెందిన కొత్త సురేందర్‌ను నియమిస్తూ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. రాష్ట్రంలో పార్లమెంట్ సీట్లు మొత్తం బీజేపీ కైవసం చేసుకునేలా పాటుపడాలని పిలుపునిచ్చారు. తన నియామకానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్, పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం తదితరులకు సురేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

చిట్యాల, మార్చి 21: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లిలో ఆటో బోల్తా పడడంతో డ్రైవర్‌తో పాటు మరో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం... తిర్మలపురం గ్రామానికి చెందిన మహిళలు గురువారం ఆటోలో చిట్యాల యూనియన్ బ్యాంక్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో మండల కేంద్రం శివారులో రహదారిపైకి వచ్చిన బాలికను తప్పించబోయి రోడ్డు పక్కకు వెళ్లడంతో ఆటో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ అశోక్, ప్రయాణికులు గోపగాని శోభ, వసంత, పద్మ, సమ్మక్కలు గాయపడగా చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. తీవ్రంగా గాయపడిన గోపగాని శోభ, పద్మను మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఆదివాసీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలి

వెంకటాపురం(నూగూరు), మార్చి 21 : ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని కోరుతూ ఆదివాసీ ఐక్య సంఘాల నాయకులు గురువారం తహసీల్దార్ వీరభద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారని, 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఏజెన్సీలో బహుళ అంతస్తుల నిర్మాణం యథేచ్ఛగా కొనసాగుతుందని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పూనెం రాంచందర్, చింత సోమరాజు, పూనెం మునేశ్వర్ రావు, తాటి లక్ష్మణ్, మధు, రాజేష్, నేత్రానందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

మంగపేట, మార్చి 21 : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో లేదని కార్యకర్తలు అధైర్యపడకుండా పోరాడాలని జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు అన్నారు. మండలంలోని తిమ్మంపేటలో బీఆర్ఎస్ కార్యకర్త దంతెనపల్లి నరేందర్ తల్లి ఇటీవల మృతి చెందగా గురువారం పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ జ్వరంతో బాధపడుతుండగా పరామర్శించారు. ఇదే గ్రామంలోని పొద్మూరు కాలనీకి చెందిన సహకార సంఘం మాజీ డైరెక్టర్ సయ్యద్ ఇంతియాజ్ బుల్లోకు గుండె ఆపరేషన్ జరుగగా లక్ష్మీనర్సింహరావు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకులు తాటి కృష్ణ, చిలుకమర్రి లక్ష్మయ్య మాజీ జడ్పీటీసీ సిద్దంశెట్టి వైకుంఠం, నాయకులు పాల్గొన్నారు.

'వేతనాలు చెల్లించే వరకు బిల్ట్‌ను కొనవద్దు'

మంగపేట, మార్చి 21: మండలంలోని కమలాపురంలో ఖాయిలా పడ్డ బిల్ట్ కర్మాగారంలో గతంలో పనిచేసిన తమకు పెండింగ్ వేతనాలు రూ.69 కోట్లు యాజమాన్యం చెల్లించే వరకు పరిశ్రమను ఏ సంస్థ కొనుగోలు చేయవద్దని రెగ్యులర్ కార్మికులు కోరుతున్నారు. గురువారం సాయంత్రం ఫ్యాక్టరీ ప్రధాన గేట్ వద్ద విలేకరులతో వారు మాట్లాడారు. గతంలో ఎన్‌సీఎల్టీ కోర్టు బిల్ట్ కార్మికులకు రూ.69 కోట్లు ఇచ్చేందుకు ఒప్పందం చేసిందన్నారు. రీసొల్యూషన్ ప్లానర్ సంస్థతో గతంలో పనిచేసిన బిల్ట్ డిప్యూటీ జనరల్ మేనేజర్(డీజీఎం) కేశవరెడ్డి, ఫ్యాక్టరీలో గల ఆరు కార్మిక సంఘాల యూనియన్ నాయకులకు రూ.9 కోట్లు మాత్రమే చెల్లించి మిగిలిన డబ్బును పంచుకునేందుకు యత్నాలు చేస్తున్నారని కార్మికులు ఆరోపించారు. ఇటీవల మంత్రి సీతక్కను కలిసి పరిస్థితిని వివరించామని వారు వెల్లడించారు. ఈ విషయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠికి అప్పగించగా సూపర్‌వైజర్ నాయర్‌ను పిలిపించి చర్చించారని తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటా : జడ్పీటీసీ

మొగుళ్లపల్లి, మార్చి 21: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నాయకత్వంలో పనిచేస్తూ బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని జడ్పీటీసీ జోరిక సదయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్‌కు ప్రజలు, కార్యకర్తలు అండగా ఉన్నారని తెలిపారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం



ములుగులో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్

ములుగు కలెక్టరేట్, మార్చి 21 : ములుగులోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్‌జాదవ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా అధికారులు, సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు పట్టణంలోని ప్రధాన రహదారిపై అడవుల సంరక్షణపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ పాల్గొని మాట్లాడారు. అడవులతోనే పర్యావరణ సమతుల్యత చెందుతుందని అన్నారు. అడవుల ప్రాముఖ్యత, ప్రపంచ దేశాలపై అడవుల ప్రభావం, క్షీణించే అడవుల అభివృద్ధి, అంతరిస్తున్న జంతువుల అభివృద్ధి, తదితర అంశాలపై వివరించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో జోగేందర్, ఎఫ్ఆర్‌వోలు శంకర్, ఎల్లయ్య, రవికుమార్, శ్రీధర్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

● వాజేడు : మండల కేంద్రంలో గురువారం అటవీ శాఖ ఉద్యోగులు ప్రపంచ అటవీ దినోత్సవంను నిర్వహించారు. వాజేడు రేంజ్ కార్యాలయం నుంచి హనుమాన్ సెంటర్ వరకు ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మానవాళి మనుగడకు అడవుల సంరక్షణ అత్యంత అవసరం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో నారాయణ, ఎఫ్‌బీవోలు వాసుబాబు, వసంత్, ప్రసాదరావు, మనీషా, కవిత, హేమలత, చక్రవర్తి, ఉపాధ్యాయులు చల్లగురుగుల మల్లయ్య, ఆనంద్, శ్రీకాంత్, వశ్యా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

● మంగపేట : ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగపేటలో బ్యానర్లతో ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా సరిహద్దులోని బ్రాహ్మణపల్లి అటవీశాఖ చెక్‌పోస్ట్ నుంచి కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ ప్రధాన గేటు వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ తీశారు. మంగపేట ఫారెస్ట్ రేంజర్ మహ్మద్ షకీల్‌పాషా మాట్లాడుతూ అందరు మొక్కలు నాటి, ఉన్న అడవులను రక్షించాలన్నారు. కార్యక్రమాల్లో డీఆర్వోలు అశోక్‌కుమార్, అరుణ, ఎఫ్‌బీవో హన్మంత్, ఎఫ్ఎస్‌వో నర్సింహ, ఎఫ్‌బీవోలు, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

పర్శికగూడెంలో వైద్య శిబిరం

వెంకటాపురం(నూగూరు), మార్చి 21: మండలంలోని పర్శికగూడెం గ్రామంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అదేవిధంగా 30 మంది గర్భిణులను పరీక్షించి మందులు అందజేశారు. 20 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిబిరంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మాస్కుల పంపిణీ

గోవిందరావుపేట, మార్చి 21: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు గ్రామంలోని సామాజిక కార్యకర్త తుమ్మల రామకృష్ణ గురువారం మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా వాతావరణంలో మార్పులు సంభవించగా సీజనల్ వ్యాధుల ప్రభావం విద్యార్థులపై చూపకుండా ఉండేందుకు ముందస్తుగా మాస్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులతో పాటు ప్రజలు కూడా సామాజిక దూరం పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులతో అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

వెంకటాపురం(నూగూరు), మార్చి 21 : గ్రామాల్లోని ప్రజలు అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై అశోక్ అన్నారు. మండలంలోని ఎదిరకాలనీలో గురువారం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం జరగగా ఆయన పాల్గొని గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా సన్మార్గంలో నడవాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలోని యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారని అన్నారు. గ్రామంలోకి ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. సమావేశంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన నాగులమ్మ జాతర

మంగపేట, మార్చి 21: మండలంలోని కోమటిపల్లి శివారు అడవిలో మూడు రోజుల పాటు వైభవంగా జరిగిన నాగులమ్మ- ముక్కుడు పోశమ్మ, సారలమ్మ దేవతల జాతర ముగిసింది. గురువారం కమలాపురం బిల్ట్ ఇంటెక్ వెల్ వద్ద గంగస్నానం అనంతరం వనదేవతలను ఊరేగింపుగా దేవరబాల(ప్రధాన పూజారి) కాయం బాయమ్మ ఆధ్వర్యంలో ఉప పూజారులు వట్టం రాజకుమారి, వట్టం సాంబశివరావు, పొడెం సమ్మక్కలు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గౌరారం వాగు ఒడ్డు నుంచి సన్నాయి, వాయిద్యాల మధ్య తీసుకొచ్చి పూజలు చేశారు. మంగపేట, గంపోనిగూడెం, కోమటిపల్లి, తొండ్యాల, లక్ష్మీపురం లో భక్తులు వేసిన చీరె, సారె, పసుపు, కుంకుమ, ఒడిబియ్యం, కానుకలను స్వీకరించారు. అనంతరం వనదేవతలకు నైవైద్యాన్ని సమర్పించారు. జాతరకు సుమారు 2వేల మంది తరలివచ్చారు.


వనదేవతల గద్దెల వద్ద చీరె, సారె సమర్పిస్తున్న భక్తులు

కాటారంలో పోలీసుల నాకాబందీ

కాటారం, మార్చి 21: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం పోలీసులు నాకాబందీ చేశారు. పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావుల నేతృత్వంలో పలువురు ఎస్సైల ఆధ్వర్యంలో 100 మందికి పైగా సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు నాకాబందీ చేపట్టాయి. రెండు గ్రూపులుగా విడిపోయిన పోలీసు అధికారులు, సిబ్బంది అంబేద్కర్ కూడలి, చింతకాని క్రాస్ రోడ్డు వద్ద విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. మూడువైపులా వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికలను పురస్కరించుకుని కోడ్ అమలవుతున్న నేపథ్యంలో డబ్బు తరలివెళ్లకుండా తనిఖీలు చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్, వాహనాల పత్రాలు లేని వారికి జరిమానా విధించామన్నారు. నాకాబందీకి వెళ్లడానికి ముందు డీఎస్పీ, సీఐలు బలగాలకు పలు అంశాలపై బ్రీఫింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో కాటారం ఎస్సై అభినవ్, ఎస్సై-2 హరిశేఖర్, మహాముత్తారం ఎస్సై మహేందర్, మహదేవపూర్ ఎస్సై కొట్టె ప్రసాద్ పాల్గొన్నారు.


పోలీసు బలగాలతో మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కాటారం, మార్చి 21: వందలాది మంది భక్తుల గోవింద నామాలు.. వేద పండితుల మంత్రోచ్ఛరణలు.. సన్నాయి వాయిద్యాల చప్పుళ్లు.. వెరసి భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. మండలంలోని ఒడిపిలవంచలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవ మూర్తులకు గురువారం జరిపించిన కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. నిర్వాహకులు ఊరేగింపుగా స్వామి, దేవేరులకు పట్టు వస్త్రాలు, పుస్తె, మెట్టెలు తీసుకురాగా వేదపండితులు వేదాంతం నాగరాజు శర్మ, సంతోష్‌చారి ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు, కల్యాణ వస్త్రాలను దాతలు అందించారు. కల్యాణాన్ని వీక్షించడానికి పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మూల సువర్ణఅమరేందర్‌రెడ్డి, మహేష్, పూర్ణేష్, బక్కిరెడ్డి, నరోత్తంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రవికుమార్ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపకులు కర్రు నాగయ్య, నిర్వాహకులు కర్రు నారాయణ, నరివెద్ది సత్యనారాయణ, రాంనారాయణ, రాజేష్‌రెడ్డి, రమేష్, రాకేష్, మధుకర్, సతీష్, సుబ్బారావు, ప్రభాకర్, రితీష్, సతీష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బీఐఎస్ నాణ్యతా ప్రమాణాలపై అవగాహన

కాటారం, మార్చి 21: మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్(బీఐఎస్) నాణ్యతా ప్రమాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. 50 మంది విద్యార్థులతో నాణ్యతా ప్రమాణాలపై క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఐఎస్ హైదరాబాద్ సంస్థ రిసోర్స్ పర్సన్ గాంధారి ప్రభాకర్, రిటైర్డ్ డీఎస్‌వో మాట్లాడుతూ మనం వాడే ప్రతీ వస్తువు నాణ్యతా ప్రమాణాల కనుగుణంగా ఉండాలని, లేదంటే ఆ సంస్థపై కేసు పెట్టొచ్చన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ప్రమాణాల గురించి క్లబ్ విద్యార్థులు ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. 'ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్' అనే అంశంపై వ్యాసరూప పరీక్ష నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించారు. ప్రథమ బహుమతి రూ.1000 పూజిత, శరణ్య, ద్వితీయ బహుమతి రూ.750 లోహిత, సంజన, తృతీయ బహుమతి రూ.500 శివకేశవ్, చరణ్, కన్సోలేషన్ బహుమతి రూ.250 అంజలి, వర్షలు గెలుచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్, సదస్సు మెంటార్ కిరణ్ భాస్కర్, ఈసీఈ హెడ్ రాంమోహన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ప్రకాష్‌రెడ్డి

భూపాలపల్లిటౌన్, మార్చి 21: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన అయిత ప్రకాష్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాష్ట్ర చైర్మన్‌గా తనను నియమించినందుకు గాను సీఎంకు ప్రకాష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్రాష్ట్ర వంతెన వద్ద వాహన తనిఖీలు

మహదేవపూర్, మార్చి 21 : మండలంలోని కాళేశ్వరం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన వద్ద పోలీసులు భారీగా వాహన తనిఖీలు చేపట్టారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంతో పాటు మంగళవారం మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్ జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న ప్రతీ వాహనాన్ని నిలిపి తనిఖీలు చేస్తున్నారు. వాహనంలో ప్రయాణిస్తున్న ప్రతీ ఒక్కరి వివరాలు సేకరిస్తున్నారు. అక్రమంగా నగదు, మద్యం, ఇతర నిషేధిత వస్తువులు తీసుకెళ్లకుండా 24 గంటలు తనిఖీ చేసి పంపిస్తున్నారు.

తెరపైకి రోజుకో పేరు...

(5వ పేజీ తరువాయి)

దొమ్మాటి సాంబయ్యకే ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారని, మొదటి జాబితాలో సాంబయ్య పేరు ఖరారవుతుందనే చర్చ జరిగింది. అయితే అనూహ్యంగా జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు మరో ఇద్దరిముగ్గురు పేర్లను సూచిస్తూ ఏఐసీసీ అగ్రనేతలకు లేఖలు ఫ్యాక్స్ చేశారు. దీంతో అధిష్ఠానం తొలి జాబితాలో వరంగల్ ఎంపీ టికెట్ ఖరారు చేయకుండా పెండింగ్‌లో పెట్టింది. ఈ నేపథ్యంలో అనూహ్యంగా బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ కాంగ్రెస్‌లో చేరటంతో రాజకీయ సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. దీంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ ఏర్పడింది.

వరంగల్‌పై కుదరని ఏకాభిప్రాయం..

అభ్యర్థిత్వం కోసం అనేక మంది ఆశావాహులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉండగా.. రాష్ట్ర మంత్రులతో పాటు ఏఐసీసీ అగ్రనేతలు కూడా తమ అనుచరులకు టికెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో వరంగల్ టికెట్‌పై ఎడతెగని ఉత్కంఠ కనిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి తనతోపాటు కాంగ్రెస్‌లో చేరిన దొమ్మాటి సాంబయ్యకు టికెట్ ఇవ్వాలనే పట్టుదలతో ఉన్నారని, కానీ వరంగల్‌కు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు తలో పేరు సూచిస్తున్నారని సమాచారం. ఇకమొదటి నుంచి కాంగ్రెస్ టికెట్‌ను జన్ను పరంజ్యోతికి ఇప్పించేందుకు మంత్రి కొండా సురేఖ ప్రయత్నించినట్టు ప్రచారం జరిగింది. అలాగే మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే. శివకుమార్ తదితరులు స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన శనిగపురం ఇందిరకు మద్దతుగా నిలిచినట్లుగా చర్చ జరిగింది. ఎమ్మెల్యేలు కూడా తమకు అనుకూలమైన మరికొందరి పేర్లను సూచించినట్టు సమాచారం. కానీ ఇటీవల పార్టీలో చేరిన సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ తొలుత టికెట్ ఆశించటం లేదని ప్రకటించి.. ఆ తరువాత తన మార్కు రాజకీయాలతో పోటీకి సై అంటున్నారు. ఇక దయాకర్‌కు సీఎంతో సత్సంబధాలున్న నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ కూడా ఆయన వైపు కొంత సానుకూలంగా ఉన్నారని, దీంతో దయాకర్ పేరు ఏఐసీసీ పరిశీలనలో చేరినట్టు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు రాగమళ్ల పరమేశ్వర్, బొడ్డు సునీత కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఆశావాహులు డిల్లీలోనే మకాం వేసి కాంగ్రెస్ అగ్రనేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వరంగల్ టికెట్‌కు తీవ్ర పోటీ ఉండటంతో ఏఐసీసీ నేతల ఆదేశాల మేరకు సోషల్ మీడియా టీమ్‌తో పాటు సునిల్ కనుగోలు నేతృత్వంలో పలుమార్లు వరంగల్ అభ్యర్థులపై ఫ్లాష్ సర్వేలు చేపట్టారు. సర్వే రిపోర్టులతో పాటు అభ్యర్థుల ఆర్థిక, అంగ బలంపై అధిష్ఠానం దృష్టి పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల్లో పార్టీ గుర్తుతో పాటు అభ్యర్థి బలం, బలహీనతలు కూడా ప్రభావం చూపే అవకాశం ఉండటంతో వరంగల్ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోందన్న చర్చ జరుగుతోంది.

ఉత్కంఠకు తెర పడేది హోలీ తర్వాతేనా?

ఇప్పటికే వరంగల్ ఎంపీ సీటుకు బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య ఖరారవడంతో ఆమె ప్రచారం కూడా ప్రారంభించారు. ఇక బీజేపీ అభ్యర్థిగా ఇటీవల పార్టీలో చేరిన అరూరి రమేష్‌కే టికెట్ ఖాయమని ప్రచారం జరుగుతుండటంతో పాటు ఆయన కూడా పార్టీలోని కీలక నేతలను కలిసి మద్దతు కోరుతున్నారు. ఇక కాంగ్రెస్‌లో మాత్రమే అభ్యర్థి ఎంపిక సవాల్‌గా మారటంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ కనిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్, మంత్రి కొండా సురేఖ సూచించిన వారికే అధిష్ఠానం మొగ్గు చూపుతుందా? లేదంటే మంత్రులు, ఏఐసీసీ నేతలు సూచించిన అభ్యర్థి వైపు కాంగ్రెస్ మొగ్గు చూపుతుందా? సర్వేల ఆధారంగా గెలుపు అవకాశాలున్న అభ్యర్థిని నిలబెడతారా అన్న చర్చ కాంగ్రెస్ శ్రేణుల్లో జరుగుతోంది.

అయితే ఏకాభిప్రాయం కుదిరితే హోలీ పండుగ తర్వాతే మరో జాబితా ఉంటుందని, అందులో మిగిలిన అన్ని స్థానాలతో పాటు వరంగల్ అభ్యర్థి ప్రకటన కూడా ఉంటుందని భావిస్తున్నారు.

పదవ తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ

భూపాలపల్లిటౌన్, మార్చి 21: పదవ తరగతి పరీక్షా కేంద్రాలను గురువారం విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు, జాయింట్ డెరెక్టర్ రాజీవ్ తనిఖీ చేశారు. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 20 పరీక్షా కేంద్రాలలో 3,544 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 3,529 మంది హాజరయ్యారని డీఈవో రామ్‌కుమార్ తెలిపారు. 15 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు జరుగుతున్న పలు పరీక్షా కేంద్రాలను ఎస్పీ కిరణ్ ఖరే, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తనిఖీలు చేశారు. రెండు స్క్వాడ్ బృందాలు 8 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. అలాగే విద్యాశాఖ జేడీ రాజీవ్ పలు కేంద్రాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్


పరీక్షా కేంద్రం వద్ద మాట్లాడుతున్న శ్రీజ

వాజేడు, మార్చి 21 : మండల కేంద్రంలో ఉన్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) పి.శ్రీజ గురువారం తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను తనిఖీ చేసిన ఆమె రోగులకు అందుతున్న వైద్యం గురించి తెలుసుకున్నారు. ప్రసూతి వార్డు, మెడిసిన్ రూం, ఫిమేల్ వార్డులను సందర్శించారు. అత్యవసర మందుల వివరాలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈవో వెంకటేశ్వర్లుకు సూచించారు. విద్యార్థులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష జరిగే ముందు ప్రతీ విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించాలన్నారు. వైద్యాధికారులు మహేందర్, హెచ్ఎస్ కోటిరెడ్డి, ఫార్మసిస్ట్ మనిషా, స్టాఫ్‌నర్సు రాజేశ్వరి, ఎల్‌టీ రజినీకాంత్, సిబ్బంది ఉన్నారు.

చెరువుకు మరమ్మతులు చేపట్టాలి


మంత్రికి సమస్యను తెలుపుతున్న ఆయకట్టుదారులు

మల్హర్, మార్చి 21 : మండలంలోని రుద్రారం ఊర చెరువుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఆయకట్టు పట్టాదారులు, రైతులు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి సమస్యను విన్నవించారు. రెండేళ్ల క్రితం భారీ వర్షాల వల్ల గ్రామానికి చెందిన ఊర చెరువుకు గండి పడింది. అప్పటి నుంచి మరమ్మతులకు నోచుకోక పోవడంతో చెరువు శిఖం భూమి కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో చెరువు మరమ్మతు పనులు చేపడితే వర్షాకాలం పంటలకు సాగునీరు అందే అవకాశం ఉందని చెప్పారు. రెండేళ్లుగా పంట పొలాలు బీడుగా ఉంటున్నాయన్నారు. స్పందించిన మంత్రి చెరువు మరమ్మతు పనులు వచ్చే నెలలో ప్రారంభమయ్యేలా చూస్తామని చెప్పినట్లు ఆయకట్టు రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఆయకట్టు పట్టాదారులు రామినేని వెంకటేశ్వర్‌రావు, రామినేని ఫణిరాజారావు, రామినేని ప్రభాకర్‌రావు, రామినేని భయంకరరావు, విజయ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకోమటిపల్లి మాజీ సర్పంచ్ మృతి

మొగుళ్లపల్లి, మార్చి 21 : మండలంలోని పెద్దకోమటిపల్లి మాజీ సర్పంచ్ మంద గోపాల్‌రెడ్డి(74) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గోపాల్‌రెడ్డి 1981 నుంచి 1995 వరకు రెండుసార్లు గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. 1985 నుంచి 1990 వరకు అప్పటి టీడీపీ మండల అధ్యక్షుడిగా, 1995 నుంచి 2000 వరకు ఆకినపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేశారు. హనుమకొండలోని వికాస్‌నగర్‌లో కుటుంబసభ్యులు ఆయన అంత్యక్రియలను నిర్వహించారు. కాగా, గోపాల్‌రెడ్డి భౌతికకాయాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీజేపీ నాయకుడు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి, నాయకులు జోరిక సదయ్య, చదువు అన్నారెడ్డి, రామచంద్రారెడ్డి, పులి వీరారెడ్డి, మంద సునీల్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

తాడ్వాయి, మార్చి 21: గొత్తికోయలు బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ జ్యోతి అన్నారు. గురువారం మండలంలోని జలగలంచ గొత్తికోయగూడెంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలలపై లైంగిక వేధింపుల గురించి జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వయసు నిండకముందే చిన్నపిల్లలకు వివాహాలు చేయడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. చిన్నపిల్లలపై లైంగిక దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎలాంటి ఇబ్బంది కలిగినా 1098, 112 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణపక్షం నిర్వహించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

డీపీవోపై కలెక్టర్ ఆగ్రహం

వాజేడు, మార్చి 21 : జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) స్వరూపపై కలెక్టర్ ఇలా త్రిపాఠి ఫైర్ అయ్యారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహించారు. దీనికి వచ్చిన కలెక్టర్ డీపీవో స్వరూపపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని పలువురు జీపీ కార్యదర్శుల బదిలీలపై కలెక్టర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని అమలు చేయకుండా డీపీవో తాత్సారం చేస్తుండటమే కాకుండా సదరు జీపీ కార్యదర్శుల నుంచి అదనపు కలెక్టర్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు రావటంతో డీపీవోపై తీవ్రంగా మండిపడ్డారు. ఒక యువ ఐఏఎస్ పేరును ఎలా దుర్వినియోగం చేస్తారని ఆగ్రహించారు. డీపీవో తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ మీరు ఇక్కడకు రాకముందు మహబూబాబాద్, వరంగల్‌లో ఎలా విధులు నిర్వహించారో తెలుసునని, ఇక్కడ అలా విధులు నిర్వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సమావేశం నుంచి తక్షణమే వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేయడంతో డీపీవో చేసేదేమి లేక వెనుతిరిగారు. ఒక్కసారిగా జరిగిన పరిణామంతో అక్కడున్న అధికారులంతా విస్తుపోయారు.

పట్టుబడితే పైనే

(5వ పేజీ తరువాయి)

గాను రూ.37,200 జరిమానా, డ్రైవింగ్ లైసెన్సులు లేని 317 మందిని గుర్తించి రూ.29వేల జరిమానా వేశారు. హెల్మెట్ ధరించిన 186 మందికి రూ.23,600 జరిమానా విధించారు. రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేసిన 15 మందికి రూ.15వేలు, ఇన్సురెన్స్ లేని వాహనాలకు 45 మందికి రూ.45వేల జరిమానాలు విధించారు. ఇక రోడ్లపై పార్కు చేసిన 191 వాహనాలకు రూ.19,100 జరిమానాలతో పాటు మిగిలిన జరిమానాలు ట్రాఫిక్ నిబంధనల మేరకు విధించారు.

ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి

- కిరణ్‌ఖరే, ఎస్పీ



ప్రజల శ్రేయస్సు కోసం పోలీసు శాఖ నిరంతరం పని చేస్తుంది. ట్రాఫిక్‌కు ఏర్పడుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రత్యేకంగా ట్రాఫిక్ ఠాణాను అందుబాటులోకి తెచ్చాం. సరిపడా సిబ్బందిని నియమించాం. ట్రాఫిక్ పోలీసు ఠాణాకు కావాల్సిన పరికరాలు, వాహనాలను కూడా త్వరలోనే సమకూరుస్తాం. వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలి.

నిబంధనలు అతిక్రమించొద్దు..

- చంద్రగిరి శ్రీనివాస్, ఎస్సై ట్రాఫిక్



వాహనదారులు ట్రాఫిక్‌నిబంధనలు అతిక్రమించొద్దు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నిరంతరంగా తనిఖీలు చేస్తున్నాం. అతివేగంగా వెళ్లడం, ట్రిపుల్ రైడ్ చేయడం వంటివి మానుకోవాలన్నారు. ప్రతీ వాహనంపై నెంబర్ ప్లేట్ తప్పక ఉండాలి. లేని పక్షంలో వాహనాన్ని సీజ్‌చేస్తాం. డ్రంకెన్ డ్రైవ్‌లు కూడా విస్తృతంగా చేపడుతున్నాం. మద్యం సేవించి పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయి.